
పురం.. ప్రగతి పథం





పట్టణాలకు నూతన కళ వచ్చింది. ఈ ఐదేళ్లలో సరికొత్తగా రూపుదిద్దుకున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించింది. అభివృద్ధి బాట పట్టించింది. మౌలిక వసతులు, పారిశుధ్యం మెరుగుపరిచింది. పచ్చదనం పెంపునకు ప్రాధాన్యత ఇచ్చింది. వెరసి విస్తారమైన రోడ్లు దర్శనమిస్తున్నాయి. అందమైన పార్కులు కనిపిస్తున్నాయి. పరిశుభ్రత పరిఢవిల్లుతున్నది. దీంతో స్థానికులు సౌకర్యంగా జీవిస్తున్నారు.

• ప్రొద్దుటూరు.. సూపరు



వైఎంఆర్ కాలనీ ఆర్చీ (ఇన్‌సెట్‌లో) స్మార్ట్ స్ట్రీట్‌గా అభివృద్ధి చేసిన మైదుకూరు రోడ్డు

- మున్సిపాలిటీలో ఘననీయమైన అభివృద్ధి
- రూ.120 కోట్లతో రోడ్లు, కాలువలు, డివైడర్ల నిర్మాణం
- రూ. 296 కోట్లతో డ్రైనేజీ ఆధునీకరణ, పైపులైన్ ఏర్పాటు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఘననీయమైన అభివృద్ధి జరిగింది. పట్టణంలోని ప్రధాన రోడ్లను విస్తరించడంతోపాటు అన్ని ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించారు. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీ కాలువల స్థానంలో కొత్త కాలువలను నిర్మించడం జరిగింది. అన్ని ప్రధాన రోడ్లను విస్తరించడంతోపాటు మధ్యలో డివైడర్లను నిర్మించి గ్రీనరీని ఏర్పాటు చేశారు. మైదుకూరు రోడ్డులో దాదాపు రూ.4 కోట్లతో స్మార్ట్ స్ట్రీట్ పనులు చేపట్టారు. సెంట్రల్ లైటింగ్‌తోపాటు ఇరువైపులా రోడ్డును విస్తరించి కాలువలను నిర్మించారు. రూ.5 కోట్లతో గాంధీ పార్కును అభివృద్ధి చేశారు. టూటౌన్ బైపాస్‌లో రూ.76.10 లక్షలతో నూతనంగా నిర్మించిన పార్కును గతేడాది మే నెల 6వ తేదీన ప్రారంభించారు. ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో పూర్వం నుంచి ఇరుకైన రోడ్డు ఉండగా ఆక్రమణలను తొలగించి వంద అడుగుల వరకు విస్తరించారు. వరలక్ష్మి అపార్ట్‌మెంట్ రోడ్డును ఇటీవల కాలంలోనే నిర్మించారు. పాణ్యం యర్రమునిరెడ్డి కాలనీ రోడ్డును విస్తరించి డివైడర్లను ఏర్పాటు చేసి గ్రీనరీని పెంచారు. పాణ్యం యర్రమునిరెడ్డి కాలనీ ఆర్చి నిర్మాణానికి సంబంధించి వారి కుటుంబ సభ్యులే నిధులు వెచ్చించారు. శివాలయం ఎదురుగా ఉన్న మార్కెట్‌ను తొలగించడంతో అనిబిసెంట్ స్కూల్ మైదానంలో తాత్కాలికంగా అన్ని సౌకర్యాలతో మార్కెట్‌ను నిర్మించారు. ఆర్యవైశ్య శ్మశాన వాటికలో విద్యుత్ దహన వాటికను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొర్రపాడు రోడ్డులో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన హిందుస్థాన్ పెట్రోలియం బంకును నిర్వహిస్తున్నారు. దీనివల్ల మున్సిపాలిటీకి ఏడాదికి రూ.కోటికిపైగా ఆదాయం వస్తోంది. పట్టణంలో కొత్తగా వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్మించారు.



విస్తరించిన ఆర్ట్స్ కాలేజీ రోడ్డు



మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోలు బంకు



వరలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద నిర్మించిన సీసీ రోడ్డు



మున్సిపల్ గాంధీ పార్కు

• బద్వేలు బస్తీ.. అభివృద్ధి జాస్తి



ప్రభుత్వాసుపత్రి భవన సముదాయం (ఇన్‌సెట్‌లో) బద్వేలులో సెంట్రల్ లైటింగ్

- సర్వాంగ సుందరంగా పట్టణం
- రూ.130 కోట్లతో పనులు
- ప్రజలకు సమకూరిన సౌకర్యాలు

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డివైడర్ల సుందరీకరణ, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టారు. దీంతో పట్టణం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. నాగులచెరువు సుందరీకరణతో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. అలాగే రైతుల సౌకర్యార్థం మార్కెట్‌యార్డు ఆవరణలో రైతుబజార్ నిర్మించారు. అంతేకాకుండా గ్రేడ్-3 మున్సిపాలిటీగా కొనసాగుతున్న బద్వేలు మున్సిపాలిటీని గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌డేట్ చేశారు. జిల్లాలో అత్యధికంగా బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.130 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే సుమారు రూ.50 కోట్ల మేర పనులు పూర్తి కాగా మరో రూ.80 కోట్ల పనులు చేపట్టాల్సి ఉంది. నాడు వెలవెలబోయిన వీధులు నేడు కళకళలాడుతున్నాయి.



మున్సిపల్ కార్యాలయ నూతన భవనం



ఎన్‌జీవో కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు





ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని డయాలసిస్ కేంద్రం (ఇన్‌సెట్‌లో) కుడా నిధులతో నిర్మించిన డివైడర్

క్లుప్తంగా

మహాభారతంపై అవగాహన



విద్యార్థులకు బోధిస్తున్న కృష్ణారెడ్డి

చాపాడు : ఈ తరం విద్యార్థులకు మహాభారతంపై అవగాహన కల్పించటం అవసరమని గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహా భారతంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద మనిషి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు మహా భారతంపై అవగాహన కల్పించారు. అందులోని నీతి, ధర్మం, మంచితనం వంటి గొప్ప అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా తెలియజేశారు. జూన్ 7వ తేదీ వరకూ వేసవి శిక్షణా తరగతులు ఉంటాయని, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలియజేశారు.

భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠించాలి



విద్యార్థులతో కైవల్య తీర్థస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠించాలని కైవల్య తీర్థస్వామి పేర్కొన్నారు. స్థానిక లైటుపాళెం సెంటర్‌లోని శ్రీ కైవల్య సత్సంగ్ ఎంపీఎస్ ధ్యాన మందిరంలో భగవద్గీతలోని 17వ అధ్యాయం శ్రద్ధ త్రయ విభాగ యోగంపై ఉచిత శిక్షణ శిబిరం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత చదవడం వల్ల మంచి, చెడు తెలుస్తుందని, పరిపూర్ణ మానవుడిగా జీవించవచ్చన్నారు. 14 ఏళ్లుగా ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో భగవద్గీత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. భగవద్గీత పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ప్రొద్దుటూరు : స్థానిక పాత మార్కెట్‌లోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో స్వామికి వైశాఖ సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆదివారం నవీనత వెన్నతో 20వ వార్డు కౌన్సిలర్ నూక నాగేందర్‌రెడ్డి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆంజనేయస్వామిని వెన్న, డ్రై ఫ్రూట్స్‌తో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎమ్మెల్యేగా, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా అత్యధిక మెజారిటీతో గెలవాలని ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కేవీఎస్ సత్యనారాయణ, ధర్మకర్త సుంకు కిశోర్ బాబు, భక్తులు పాల్గొన్నారు.

కథ రచన, పద్య పఠన పోటీలు



కథ రచన పోటీలో విద్యార్థులు

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తినారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరంలోని విద్యార్థులకు ఆదివారం కథ రచన, పద్య పఠన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువులబాబు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు కథలు, పద్యాలతో విజ్ఞానం, వినోదం అందిస్తూ ఆటలు, పాటలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఎంతో ఆసక్తితో విద్యార్థులు కథ రచన, పద్య పఠన పోటీల్లో పాల్గొన్నారన్నారు. భవిష్యత్తులో రచయితలుగా రాణించాలని సూచించారు. అనంతరం గంగాధర్‌రెడ్డి విద్యార్థులచే జిరాఫీ చెస్ ఆడించారు. స్పోకెన్ ఇంగ్లిషు మాస్టర్ పవన్ కళ్యాణ్ విద్యార్థులచేత ఇంగ్లీషు కాన్వర్జేషన్ ప్రాక్టీస్ చేయించారు. విద్యార్థులకు స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ హెల్పర్ నాగలక్ష్మి, మునిశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు

కడప కార్పొరేషన్: కడప నగరం రహమతుల్లా వీధిలో వెలసిన హజరత్ ఖాజా బందే నవాజ్ చాంద్‌పిరి గుమ్మద్ ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో కాల్‌టెక్స్ కుటుంబ సభ్యులు హబీబుల్లా, హఫీజుల్లా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేసినట్లు వారు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



అట్లూరు : గొడుగునూరులో మట్లాడుతున్న పోలీస్ అధికారులు



కలసపాడు : రాజుపాలెం గ్రామసభలో మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగమురళి

అట్లూరు : జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బద్వేలు రూరల్ సీఐ విక్రమ సింహా, స్థానిక ఎస్‌ఐ కేసీ రాజు, బద్వేలు రూరల్ ఎస్‌ఐ రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం బద్వేలు రూరల్ మండల పరిధిలోని గొడుగునూరు, పుట్టాయిపల్లి గ్రామాలలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వీధులలో కలియ తిరిగి, వరిగడ్డివాములలో అనుమానితుల ఇళ్లలో క్షుణ్ణంగా సోదాలు చేశారు. ఆయా గ్రామాలలోని ప్రజలతో వారు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం బాణాసంచాలు పేల్చడం, అల్లర్లు సృష్టించడం లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు రూరల్, అట్లూరు పోలీసులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టించకండి

కలసపాడు : ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్‌ఐ నాగమురళి, కాశినాయన ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో నాకాబందీ, కవాతు, గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజున వరకు గానీ, కౌంటింగ్ రోజు గానీ, కౌంటింగ్ తదుపరి రోజుల్లో గానీ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వరాదని పేర్కొన్నారు. అనుమతి లేకుండా అక్రమ మద్యం, మందుగుండు సామగ్రి, ఫైర్‌క్రాకర్స్ లాంటి వాటిని వారి వద్ద ఉంచుకోవడం గానీ విక్రయించడం గానీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

నిబంధనలు పాటించాలి

బ్రహ్మంగారిమఠం : జూన్ 4న జరిగే కౌంటింగ్ సందర్భంగా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పార్టీలపై అభిమానం ఉన్న వారు పోలీస్ నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులకు తెలిపారు. ముఖ్యంగా ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎక్కడో కౌంటింగ్ జరుగుతుంటే గ్రామాల్లో సంబరాలు చేసుకున్నా, ఇతర పార్టీల వారితో అతిగా మాట్లాడినా అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా రౌడీషీట్ ఓపెన్ చేస్తామని తెలిపారు. ర్యాలీలు, సంబరాలు జరుపుకోవద్దు అన్నారు. అలా ఎవరైనా జరుపుకొన్నా, గ్రామాల్లో ఘర్షణకు దిగినా పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

బి.కోడూరు : మండలంలోని అనంవారిపల్లె గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. బద్వేలులోని బంగారు శీనయ్య హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యులు డాక్టర్ గానుగపెంట రాహుల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.రాహుల్ మాట్లాడుతూ పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని వారికి మెరుగైన వైద్యం కోసం మండలంలో ఇంకా వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు రాహుల్

నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు. గ్రామంలో విలేజ్ క్లీనిక్ భవనం వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవరమైన మందులు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు.

చదువుతోపాటు దేశభక్తి ముఖ్యం

అట్లూరు : విద్యతోపాటు దేశభక్తి ఎంతో ముఖ్యమని గ్రంథాలయాధికారి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయ ఆవరణలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు జాతీయగీతం, పుస్తకపఠనం, నీతికథలు, మ్యూజికల్ చైర్స్ తదితర ఆటలపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయాధికారి తినుబండారాలు అందజేశారు.



దేశభక్తి గేయాలు ఆలపిస్తున్న విద్యార్థులు

జాతరలతో బలపడనున్న బంధుత్వాలు



తుమ్మలపల్లెలో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బి.కోడూరు : తిరునాళ్లు, జాతరలు తదితర కార్యక్రమాల వల్ల పాత బంధువులు, స్నేహితులతో సత్సంబంధాలు పెరిగి బంధాలు, బంధుత్వాలు బలపడతాయని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో శ్రీకోదండరాముని విగ్రహ ప్రతిష్ట జరిగి మండల పూజ సందర్భంగా జాతర ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్సీని ఆహ్వానించారు. ఈ మేరకు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి స్థానిక నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన వారి వారి బంధువులను చూసి ఇలాంటి కార్యక్రమాల వల్ల పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడంతోపాటు బంధాలు మెరుగుపడటంతో పాటు గ్రామంలోని గ్రామస్తులు కూడా స్నేహ సంబంధాలతో ఉండే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ శేషారెడ్డి, నాయకులు రామసుబ్బారెడ్డి, నాగిరెడ్డి, వీరకుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, బద్వేలు జెడ్పీటీసీ వంకెలపోలిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు మంజూరు

ఖాజీపేట : మండలానికి 150 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు మంజూరైనట్లు ఏఓ నాగార్జున తెలిపారు. మండలానికి 350 క్వింటాళ్లు అవసరం ఉండగా, అందులో 150 క్వింటాళ్లు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఇప్పటి వరకు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పచ్చిరొట్ట విత్తనాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాల విషయంపై ఉన్నతాధికారులు స్పష్టత లేని కారణంగా నమోదు ఆపివేసినట్లు చెప్పారు. పై అధికారుల నుంచి అనుమతులు వస్తే తిరిగి నమోదు చేసుకుని రైతులకు అందించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మండలంలో అధికంగా వరి సాగు చేస్తున్నందున మంజూరైన విత్తనాలు సరిపోవన్నారు. ఉన్నతాధికారుల అనుమతుల కోసం సిఫార్సు చేసినట్లు తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే నమోదు ప్రక్రియ మొదలు పెట్టి అందరికీ విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

కేజీ పీజీ సెట్- 2కే24 ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్ : కందుల విద్యాసంస్థల్లో ఇటీవల ఎంబీఏ అడ్మిషన్ల కోసం నిర్వహించిన కేజీ పీజీ సెట్ – 2కే24 ఫలితాలను కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి ఆదివారం విడుదల చేశారు.

విద్యను మించిన ఆస్తి లేదు



స్కూల్‌ను ప్రారంభిస్తున్న ఐపీఎస్ అధికారి మహేశ్వర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు

బద్వేలు అర్బన్ : సమాజంలో విద్యను మించిన ఆస్తి మరొకటి లేదని మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన ఐపీఎస్ అధికారి మహేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ జిల్లా ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు పేర్కొన్నారు. పట్టణంలోని మైదుకూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సూర్య నెక్స్ట్ జెన్ స్కూల్‌ను ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సమాజం పట్ల బాధ్యత, పెద్దల పట్ల గౌరవం, సంస్కారం నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, పాఠశాల చైర్మన్ చెన్నుపల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ బోగేంద్రనాథ్‌రెడ్డి, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, అర్బన్ సీఐ యుగంధర్, మండల విద్యాశాఖాధికారి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (రిమ్స్) ఐపీ విభాగంలో బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది.